క్లుప్తంగా



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

మల్‌రెడ్డికి అభినందన

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని బుధవారం డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్: మండల పరిధిలోని గుర్లకుంటతండాకు చెందిన పాత్లవత్ హన్నీ అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, లోకేశ్, భారతమ్మ, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, మంజుల, ప్రియ నాయకులు చంద్రమౌళి, రమేశ్, వీరయ్య, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

రాజ్‌ఘాట్ వద్ద నేతల నివాళి



నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ఆమనగల్లు: న్యూఢిల్లీలోని మహాత్మాగాంధీజీ రాజ్‌ఘాట్‌ను బుధవారం ఆర్యవైశ్య సంఘం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు బాపూజీకి నివాళులర్పించారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు నర్సింహ, శ్రీనివాస్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

ఈదమ్మ తల్లికి పట్టువస్త్రాలు



జాతరలో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: వెల్దండ మండలం చెర్కూరులో సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈదమ్మ, మాందాత ఉత్సవాలలో బుధవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు శ్రీనివాస్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు భీమయ్యగౌడ్, మైసయ్య, నర్సింహ, సత్యం, శ్రీనునాయక్, ప్రశాంత్, రాంచందర్‌గౌడ్, లాలయ్య, శ్రీను, సర్పంచ్ అంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మన్నెగూడకు మంత్రుల రాక

తుర్కయంజాల్: మన్నెగూడలోని ప్రాంతీయ రవాణాశాఖ నూతన కార్యాలయాన్ని గురువారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రారంభించనున్నట్లు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి రఘునందన్ గౌడ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుందని ఆయన పేర్కొన్నారు.

నేడు వైద్య శిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో గురువారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు, రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా వేడుకలు, సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. కడ్తాల మండల కేంద్రంలో కేకు కటింగ్, ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ముర్తుజపల్లిలో హెల్త్‌క్యాంపు, ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రిలో మెగా హెల్త్ క్యాంపు, రక్తదానం శిబిరం, తలకొండపల్లి మండల కేంద్రంలో కేకు కటింగ్, కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు బుధవారం సివిల్ సప్లయ్, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీప్‌దాస్‌మున్షీని మర్యాద పూర్వకంగా కలిశారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో నాయకులు సత్యనారాయణ, మదన్‌పాల్‌రెడ్డి ఉన్నారు.

మురుగు చేరి.. గుంతలు ఏర్పడి!

- అధ్వానంగా చిత్తాపూర్–తిప్పాయిగూడ రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



చిత్తాపూర్–తిప్పాయిగూడ రోడ్డు దుస్థితి

మంచాల: రహదారి గుంతలమయమై తొమ్మిది నెలలు కావస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదీ మంచాల మండలంలోని చిత్తాపూర్–తిప్పాయిగూడ ప్రధాన రోడ్డు పరిస్థితి. ద్విచక్ర వాహనాలు సైతం రాకపోకలు సాగించలేని దుస్థితి దాపురించింది. మురుగునీరు రోడ్డుపైకి చేరడంతో గుంతలు ఏర్పడి ఛిద్రమవుతోంది.

ప్రయాణం నరకం

రోడ్డు ఛిద్రమై రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగిస్తోంది. దీనికి తోడు గ్రామం నుంచి వెలువడిన వ్యర్థాలు రహదారిపై చేరడంతో మురుగు ఏరులై పారుతోంది. దీంతో పరిసరాలన్నీ దుర్గంధం వ్యాపించి వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తోంది. మార్గం గుండా పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రయాణం నరకప్రాయంగా మారింది. రాత్రి సమయంలో ఏమాత్రం అజాగ్రత్తగా డ్రైవింగ్ చేసినా ప్రాణాలకు ప్రమాదం తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డును బాగు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ శాఖ అధికారి వివరణ కోసం ఫోనులో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

నిత్యం రాకపోకలు

చిత్తాపూర్–తిప్పాయిగూడ రహదారి నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా సరిహద్దు గ్రామాలను చేరుకునేందుకు సులభమవుతుంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. యాదాద్రి జిల్లాలోని నారాయణపురం, చౌటుప్పల్ మండలాలలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు ఇబ్రహీంపట్నం వైపు రావడానికి ఈ రోడ్డు మీదుగానే ప్రయాణం చేస్తుంటారు. వీటన్నింటినీ దృష్టిలోని తీసుకొని మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉందని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గుంతలతో ప్రమాదం



ప్రధానంగా చిత్తాపూర్ నుంచి తిప్పాయిగూడ వెళ్లే రోడ్డు కావడంతో మాకు చాలా ఇబ్బందిగా మారింది. గ్రామం నుంచి బయటకు రావాలంటే కష్టంగా మారింది. గుంతలతో ప్రమాదాలు సంభవించి ప్రజల ప్రాణాలు పోక ముందే చర్యలు తీసుకోవాలి.

– ఆవుల శ్రీనివాస్ యాదవ్, తిప్పాయిగూడ

మరమ్మతులు చేయాలి



చిత్తాపూర్ సమీపంలో మురుగునీరు రోడ్డుపై పారడంతో రహదారి పాడైపోయింది. తక్షణమే మరమ్మతులు చేయాలి. రాత్రి పూట ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలి.

–చిల్లాపురం మధు, తిప్పాయిగూడ

సమన్వయంతో పని చేయాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
కడ్తాల్‌లో సర్వసభ్య సమావేశం



కడ్తాల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

కడ్తాల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, తహసీల్దార్ ముంతాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు లచ్చిరామ్ నాయక్ వంకరాయి తండా, కాడ్యతండాలలో అంగన్‌వాడీ పోస్టుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరగా, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి వివరణ ఇచ్చారు. మండలంలో రైతులకు సంబంధించిన భూములు రికార్డులలో నమోదు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ సభ దృష్టికి తెచ్చారు. ముద్విన్ గ్రామ సమీపంలోని వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని చర్యలు తీసుకోవాలని సర్పంచ్ యాదయ్య కోరగా, అడ్డుకుంటామని తహసీల్దార్ ముంతాజ్ పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: ఎమ్మెల్యే

సమన్వయంతో పనిచేస్తూ నూతనంగా ఏర్పడిన కడ్తాల్ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా చేయాలని డీఈ మోహన్‌రెడ్డికి సూచించారు. చెరువులు, కుంటల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్‌తో పాటు, ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. చరికొండ ఉన్నత పాఠశాలకు అదనపు గదుల నిర్మాణానికి రూ.15 లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు. మండలంలోని ఒక్కో ఎంపీటీసీకి అభివృద్ధి పనుల నిమిత్తం రూ.5 లక్షల చొప్పున కేటాయిస్తామన్నారు. అభివృద్ధికి ఎన్ని నిధులైన ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈవో సర్దార్, ఎంపీవో మధుసూదనచారి, సర్పంచులు, ఎంపీటీసీలు లక్ష్మీనర్సింహారెడ్డి, భారతమ్మ, పాండు నాయక్, హరిచంద్, కోఆప్షన్ జహంగీర్‌బాబా, రాములుగౌడ్, నిర్మలాదేవి, సులోచన, మంజుల, సీఐ శివప్రసాద్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల ఆవేదన

గత ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు చేసి పనులు చేపట్టామని.. నేటికీ బిల్లులు రాలేదని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.90 లక్షల వరకు తనకు బిల్లులు రావాల్సి ఉందని అన్మాస్‌పల్లి సర్పంచ్ శంకర్ అన్నారు. పదిహేను రోజుల్లో పదవీ కాలం ముగుస్తుందని వెంటనే బిల్లులు వచ్చేలా సమస్యను సీఎం దృష్టికి తీసుకు వెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. అదే విధంగా పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సర్పంచులు సభలో డిమాండ్ చేశారు.

గ్రామాలాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి • గౌరిపల్లిలో గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభం



తలకొండపల్లి: గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తలకొండపల్లి: అంతర్గత సీసీ రోడ్లు, వాటర్ ట్యాంక్‌లు, మురుగు కాల్వలు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామాలాభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ప్రాధాన్యం ప్రకారం ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులను చేపట్టి జిల్లాలోనే మండలాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతానని ఎమ్మెల్యే తెలిపారు. మండల పరిధిలోని గౌరిపల్లిలో బుధవారం సర్పంచ్ అనురాధ నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పని చేసే నాయకులు, కార్యకర్తలకు పార్టీ పరంగా తగిన గుర్తింపు ఉంటుందన్నారు. రూ.5 లక్షల నిధులు మంజూరు చేసి గ్రామంలో మహిళా సంఘం భవనాన్ని నిర్మిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకట్రాంరెడ్డి, శ్రీశైలం ఎంపీటీసీలు సరిత, రమేశ్, సీనియర్ నాయకులు రేణురెడ్డి, యాదయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ యాదయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, నాయకులు యాదయ్య, రాములు, లక్ష్మీదేవి, రఘురాములు, లింగంగౌడ్, డేవిడ్, చెన్నకేశవులు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి చేయూత

కడ్తాల్: మండలంలోని కొండ్రిగాన్‌బోడ్‌తండా పంచాయతీ పరిధిలోని పెద్దారెడ్డి చెరువుతండాకు చెందిన రామవత్ సురేశ్‌నాయక్‌కు చెందిన 14 మేకలను ఈనెల 11న దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితుడు సురేశ్‌నాయక్‌ను బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కలిశారు. స్థానిక నాయకుడు బిక్కునాయక్ సమకూర్చిన రూ.10 వేలను బాధితుడికి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, బిక్కునాయక్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, జహంగీర్‌అలీ, బీచ్యానాయక్, బుచ్చయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

భూదాన్ భూమిని సంరక్షించండి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య

తుర్కయంజాల్: తుర్కయంజాల్ రెవెన్యూ పరిధిలోని భూదాన్ సర్వే నంబర్ 206లో 4.29 ఎకరాల భూమికి హద్దులను ఏర్పాటు చేసి, సంరక్షించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కబ్జాదారుల చెర నుంచి కాపాడకపోతే సీపీఐ ఆధ్వర్యంలో పేదల చేత గుడిసెలు వేయిస్తామని తెలిపారు. భూమిని కాపాడాలని కోరుతూ 2016 నుంచి పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కొందరు ప్రజాప్రతినిధులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై గతంలో లే ఔట్ చేయగా ప్రస్తుతం వాటికి ఇళ్ల నిర్మాణ అనుమతులు మంజూరు చేస్తుండటంతో యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు

కొత్తూరు: ప్రభుత్వ భూమిలో వ్యర్థాలను పారబోస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామ శివారులోని ఒక పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థాలను ఇదే గ్రామానికి చెందిన కొందరు ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి సమీపంలోని ప్రభుత్వ స్థలాల్లో పారబోస్తున్నట్లు తీగాపూర్ గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి కొత్తూరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యర్థాలను తింటున్న పశువులు అనారోగ్యాలకు గురవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. అంతే కాకుండా వ్యర్థాలనుంచి పారేనీరు పంటపొలాల్లోకి చేరి దిగుబడి తక్కువస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి తగిన విచారణ చేపట్టి వెంటనే సంబంధికులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

శిఖం భూమిని సంరక్షించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని తారమతిపేటలో పోల్కమ్మ చెరువు శిఖం భూమిని రియల్ వ్యాపారులు ఆక్రమించుకుని రోడ్డు వేస్తున్నారని, వాటిని అడ్డుకొని సంరక్షించాలని కోరుతూ సీపీఎం నాయకులు బుధవారం తహసీల్దార్ రవీందర్ దత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శిఖం భూమితో పాటు చెరువు నుంచి రోడ్డు వేశారని ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఆర్డీఓలకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ఇరిగేషన్‌శాఖ అధికారులతో కుమ్మక్కై అక్రమార్కులు శిఖం భూమిని ఆక్రమించుకొని రోడ్డు వేశారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన శిఖం భూమిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు శివకుమార్, యాదయ్య, శివ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

ఆమనగల్లు: మండలంలోని ఆకుతోటపల్లిలో మూడు రోజుల పాటు నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో స్థానిక నాయకుడు న్యాలపట్ల నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతగా నిలిచిన వంశీ టీమ్‌కు రూ.7,500 నగదు, షీల్డు, ద్వితీయస్థానంలో నిలిచిన షఫి టీమ్‌కు రూ.4 వేలు, షీల్డు అందజేశారు. అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు స్నేహభావానికి దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, టోర్నమెంట్ నిర్వాహకులు వంశీ, శ్రీకాంత్, మహేశ్, శేఖర్, స్థానిక నాయకులు బాలు, రాంచందర్, క్రాంతి, సుధాకర్, కృష్ణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో చందానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

మొయినాబాద్: ఇరవై ఎనిమిదేళ్ల క్రితం ఒకే పాఠశాలలో చదివినవారంతా ఒకే చోట మళ్లీ కలిశారు. చదువుకునే రోజుల్లోని మధుర జ్ఞాపకాలను, తీపి గుర్తులను స్మరించుకున్నారు. మండల పరిధిలోని చందానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం రెడ్డిపల్లి సమీపంలోని గ్రీన్ పార్క్ ఫాంహౌస్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాడు ఒకే చోట చదివినవారంతా హాజరై నాటి మధుర జ్ఞాపకాలు, చిలిపి చేష్టలను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుత పరిస్థితులు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు జయప్రకాష్, కృష్ణారెడ్డి, నిర్మల, జ్యోతి, కృష్ణారెడ్డిలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గణేష్‌గౌడ్, ఆంజనేయులు, రాకేష్, రఘు, శ్రీశైలం, రమేష్, సుధాకర్, సామెల్, శైలజ, ఉమారాణి, లక్ష్మి, కంసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికచింతనతో ప్రశాంతత

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



జాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: ఆధ్యాత్మికచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ ప్రతాపగిరి లక్ష్మీనర్సింహ్మస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఈ పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. దీంతో మనస్సు ఏకాగ్రతతో ఉంటుందన్నారు. శ్రీ ప్రతాపగిరి లక్ష్మీనర్సింహ్మ స్వామి దేవాలయానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందన్నారు. ప్రతి ఏడాది ఎంతో వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. దేవాలయాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

షాబాద్: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు అక్కమొల్ల ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో రెండు రోజులుగా ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు, శరీరం ధృడంగా తయారవుతుందన్నారు.

విద్యుత్‌కు అంతరాయం

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున గురువారం మంగళ్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆదిబట్ల విద్యుత్ శాఖ ఏఈ జయన్న తెలిపారు. మంగళ్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ మంగళ్‌పల్లి–2 ఫీడర్ మీద లైన్లకు చెట్ల కొమ్మలు తాకుతున్నాయని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తొలగిస్తామన్నారు. మంగళ్‌పల్లి, లాజ్జ ఐస్క్రీం కంపెనీ, సాహెబ్‌గూడ, ఆర్‌వీవీ అగ్రిఫీడ్స్, వైష్ణవి రైస్‌మిల్‌లకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

పెద్దఅంబర్‌పేట పరిధిలో

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కేవీ విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్‌ను నిలివేయనున్నారు. పెద్దఅంబర్‌పేటలోని అంబికానగర్, స్వగృహ వెంచర్, పోలీస్‌కాలనీ, సిరినగర్, మునగనూర్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అదే విధంగా గండిచెరువు రోడ్డు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12గంటల నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.

ఇబ్రహీంపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరాఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. చర్లపటేల్‌గూడ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నాగన్‌పల్లి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్‌ను నిలిపి వేయనున్నారు.

పెండింగ్ డీఏలు చెల్లించాలి

మంచాల: ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్‌లకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను (కరువు భత్యం) తక్షణమే చెల్లించాలని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎ.వి.సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఆరు నెలలకు ఒకసారి డీఏ పెంచగానే, రాష్ట్ర ప్రభుత్వం సైతం తమ పరిధిలోని ఉద్యోగులకు పెంచాలి. గత ప్రభుత్వాలు సకాలంలో చెల్లించకుండా మూడు డీఏలను పెండింగ్‌లో పెట్టడంతో వేతన జీవులు తీవ్ర నిరాశలో ఉన్నారని తెలిపారు. కొత్త ప్రభుత్వమైన తమకు రావల్సిన డీఏలు, పెండింగ్ బకాయిలు, పీఆర్సీ వంటి అంశాలను సకాలంలో మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆర్థిక సాయం అందజేత



మృతుడి కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న ఆనంద్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి

కేశంపేట: మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామంలో బుధవారం ఎండీ అజం ఖాన్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు పల్లె ఆనంద్‌కుమార్, గ్రామానికి చెందిన శ్రీధర్‌రెడ్డిలు రూ.5వేల చొప్పున్న అంత్యక్రియల కోసం ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, మల్లేశ్, లింగం యాదవ్, శ్రీశైలం, కృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉత్తమ భవిష్యత్

ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్‌రావు



బహుమతులు అందజేస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు తదితరులు

మంచాల: యువత క్రమశిక్షణతో మంచి మార్గంలో నడవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. బుధవారం చెన్నారెడ్డిగూడలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడోత్సవాల్లో భాగంగా బహుమతుల ప్రదానోత్సవంలో ఏసీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని యువత ఉన్నత స్థాయికి ఎదగడానికి కృషి చేయాలన్నారు. కష్టపడితే తప్ప ఏ రంగంలో ముందుకు పోలేమన్నారు. ఆట, పాటలతో పాటు ఉన్నత భవిష్యత్ కోసం పాటు పాడాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు యాదయ్య, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం



సమావేశానికి హాజరైన ఆమనగల్లు బీఆర్‌ఎస్ నేతలు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలానికి చెందిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు తరలివెళ్లారు. నాగర్‌కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. సమావేశానికి ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ, మార్కెట్ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, ఆమనగల్లు వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, నాయకులు అర్జున్‌రావ్, ఖలీల్, సుభాష్, శ్రీనునాయక్, సైదులు గౌడ్, పంతునాయక్, రమేశ్, వెంకటేశ్, సతీష్ తదితరులు ఉన్నారు.